


www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం: పోలీస్ కమిషనర్



5వ పేజీల్లో

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 185, గురువారం 6-8-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam


# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి



## తుమ్మిడిహెట్టిపై కేంద్రమంత్రి పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

### తెలంగాణ, మహారాష్ట్ర మధ్య భేటీ ఏర్పాటు చేయండి

### సానుకూలంగా స్పందించిన పాటిల్

### కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్‌తోనూ సీఎం భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం ఎత్తు పెంచడానికి అనుమతించేలా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బరాజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉ ఒడదని పేర్కొన్నారు. కాబట్టి కనీసం 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం.. బుధవారం ఉదయం కేంద్రమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి పీఎంఓ స్పందించి జలవనరుల శాఖకు లేఖ పంపడం తదితర విషయాల గురించి పాటిల్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి గతంలోనే ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 152 మీటర్ల వరకు ఎత్తుతో బరాజ్ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసిందని, ఆ అధ్యయనం ప్రకారం152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని చెప్పారు. ఆ ముంపులోనూ 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని అన్నారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పీఎంఓ నుంచి లేఖ వచ్చింది: పాటిల్**

పీఎంఓ నుంచి లేఖ అందిందని ముఖ్యమంత్రికి పాటిల్ చెప్పారు. దీనిపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ..మిగతా 2లో



### గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపికి

# అనుకూల నిర్ణయాలు

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

### 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 5:**

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం ..మిగతా 2లో

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2026 గ్లోబల్ సమ్మిట్

### సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

### భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, ఆగస్టు 5 :**

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే ..మిగతా 2లో



# లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

### క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

### నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 5:**

తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ..మిగతా 2లో

# రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు షరతులతో కూడిన అనుమతి



**హైదరాబాద్, ఆగస్టు 5 :**

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ..మిగతా 2లో



## ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

### ఎన్‌వోసిలను పరిశీలించగా నకిలీవని తేలింది

### వీటిపై విచారణ కొనసాగుతుందన్న బోర్డు సెక్రటరీ

**హైదరాబాద్, ఆగస్టు 5 :**

ఇంటర్మీడియట్ కాలేజీలకు ఎన్‌వోసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఎన్‌వోసి లను హైడ్రాతో సంప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు.నకిలీ ..మిగతా 2లో

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

### నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

### 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 5 :**



హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ..మిగతా 2లో

# దిగివచ్చిన మెటా.. మోడీకి క్షమాపణలు

### కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు ..మిగతా 2లో

# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి



**మొదటి పేజీ తరువాయి...**

ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

**ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరు--రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. బుధవారం పార్లమెంట్ భవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని చెప్పారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి, ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు.

**ప్రధానిని దూషిస్తే బీజేపీ రాష్ట్రాల్లో ఒక్క కేసైనా పెట్టారా?**

ప్రదానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీలను సోషల్ మీడియా వేదికగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం పూర్తిగా చట్ట ప్రకారమే ముందుకు వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో ప్రధానిని, ఆయన తల్లిని దూషిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసు అధికారిని బదిలీ చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు.

పనీపాటా లేనోళ్లు విమర్శలు చేస్తున్నారు..

వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారని రేవంత్ చెప్పారు. 'ప్రధానిపై, ఆయన తల్లిపై అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి డీఎస్పీ బదిలీ వ్యవహారంపై ఢిల్లీలో పనీపాటా లేని కొందరు విమర్శలు చేస్తున్నారు..'అని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారుల బదిలీ అనేది ముఖ్యమంత్రికి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారమని, తన బాధ్యతల్లో అది కూడా ఒకటని పేర్కొన్నారు. బీజేపీ నేతలే వేరేవాళ్లను దారుణంగా తిడుతున్నారని, కాంగ్రెస్ నేతలను, ప్రతిపక్ష పార్టీల నాయకులను, విద్యార్థులను అభ్యంతరకరమైన పదాలతో దూషిస్తున్నారని మండిపడ్డారు.

# గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

**మొదటి పేజీ తరువాయి...**

చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉ ద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన

ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉ ంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# దిగివచ్చిన మెటా.. మోడీకి క్షమాపణలు

**మొదటి పేజీ తరువాయి...**

అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది.

ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉ న్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది?



పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**మొదటి పేజీ తరువాయి...**

ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

**మొదటి పేజీ తరువాయి...**

బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతానని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2026 గ్లోబల్ సమ్మిట్

**మొదటి పేజీ తరువాయి...**

లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్‌వోసిల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫేక్ ఎన్‌వోసి ల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమతులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు షరతులతో కూడిన అనుమతి

**మొదటి పేజీ తరువాయి...**

లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# వైభవంగా నంద్యాల బిషప్ డాక్టర్ సంతోష్ ప్రసన్న రావు వార్షికోత్సవ సంబురం

- హాజరైన తమిళనాడు రాష్ట్ర సినాడ్ జాతీయ మోడరేటర్మ డాక్టర్ ప్రిస్కిల్లా రూబిన్ మార్క్.
- రాయలసీమ బిషప్ ఐజక్ వరప్రసాద్ రావు, భారతి, బ్యూలా సంతోష్ ప్రసన్న రావు.
- షాపింగ్ కాంప్లెక్స్ ప్రార్ధనా మందిరాల ప్రారంభోత్సవం







**నంద్యాల, ఆగష్టు 5(భద్రాద్రి న్యూస్):** నంద్యాల సిఎస్ఐ డైసిస్ బిషప్ డాక్టర్ సంతోష్ ప్రసన్న రావు నంద్యాల పీఠాధిపతి పూర్తియిన ప్రధమ వార్షికోత్సవ సంబురం స్థానిక హోలీ క్రాస్ కేథడ్రల్ చర్చిలో వైభవోపేతంగా జరిగింది . డైసీస్ పరిధిలోని నంద్యాల , కర్నూలు, ప్రకాశం, కడప, అనంతపురం, తెలంగాణ రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మత గురువులు , విశ్వాసులు హాజరై బిషప్ సంతోష్ ప్రసన్న రావును గజమాలలు , శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు తమిళనాడు రాష్ట్ర సిఎస్ఐ కేంద్రమైన సినాడ్ మోడరేటర్ ప్రొఫెసర్ రూబీన్ మార్క్ సతీమణి ప్రిస్కిల్లా రూబిన్ మార్క్ , రాయలసీమ బిషప్ ఐజక్ వరప్రసాద్ రావు, ఉమెన్ ఫెలోషిప్ బాధ్యులు భారతి ముఖ్య అతిథులుగా హాజరై వార్షికోత్సవ సంబురాలలో నంద్యాల బిషప్ ను సత్కరించారు. ఈ సందర్భంగా మోడరేటర్మ ప్రిస్కిలా రూబెన్ మార్క్ మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసుప్రభు మనందరికీ ఎల్లప్పుడూ స్వాంతన అందిస్తున్నందువలన దేవుని పట్ల ఆరాధనతో మెలగాలని కోరారు. నంద్యాల బిషప్ డాక్టర్ సంతోష్ ప్రసన్న రావు మాట్లాడుతూ దేవుడిచ్చిన ఆధ్యాత్మిక బలంతో నంద్యాల డైసిస్ ను జాతీయస్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు జరిగే పరిచర్యలో మత గురువులు, విశ్వాసులు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిరంతరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నంద్యాల డైసిస్ పరిధిలో ఆధ్యాత్మిక ప్రజా ఉపయోగ నిర్మాణాలను పూర్తి చేశామని , మిషన్ ఆస్పత్రిని కార్పోరేట్ హంగులతో సౌకర్యాలు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి కృషి జరుగుతుందన్నారు. మత గురువుల సంక్షేమానికి ప్రత్యేకంగా 50 లక్షల రూపాయలతో సంక్షేమ నిధి తో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. విశ్వాసులందరూ ఆధ్యాత్మిక, సంక్షేమ కార్యక్రమాలలో తమ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

రాయలసీమ బిషప్ డాక్టర్ ఐజక్ వరప్రసాదరావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో అతి తక్కువ సమయంలో నంద్యాల డైసిస్ కు ఆధ్యాత్మిక, సంక్షేమ పథకాల అమలులో ఖ్యాతి పొందిందని వివరించారు. నంద్యాల బిషప్ సంతోష్ ప్రసన్న రావు సతీమణి బ్యూలా సంతోష్ ప్రసన్న రావు మాట్లాడుతూ మతగురువులు, విశ్వాసులు నంద్యాల డైసిస్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో నిత్యం సంపూర్ణ సహకారంతో భాగస్వాములు కావాలని కోరారు. మరో 14 సంవత్సరాలపాటు నంద్యాల డైసిస్ ను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి వెన్నుదన్నుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డైసిస్ ఎగ్జిక్యూటివ్ బాధ్యులు రాజేంద్ర బాబు, ప్రభుదాస్, డాక్టర్ నందం ఇసాక్, ఎం స్టీవెన్, బండి సామెల్, 85 ఫాస్ట్రేట్ లోని 102 మంది పాస్టర్లు, మిషనరీలు, సువార్తికులు, బైబిల్ అమ్మగార్లు తో పాటు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



# మణుగురు పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయం

- ఇది సిపిఐ ఏఐటియూసి విజయం
- భవిష్యత్తో సింగరేణి మనుగడ కోసం మరిన్ని పోరాటం
- ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం గట్టి ప్రయత్నం
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగామ మార్చేందుకు కృషి
- పాస్పోర్టు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు
- కొత్తగూడెం బైపాస్కు రూ.500 కోట్లు మంజూరు
- సీతారామ ప్రాజెక్టు ద్వారా ఎక్కువ ఆయకట్టుకు కృషి
- విలేకరుల సమావేశంలో ఎంఎల్ కూనంనేని



**భద్రాద్రికొత్తగూడెం,ఆగస్టు 5( భద్రాద్రిన్యూస్) :** మణుగూరు పికే బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయమని, ఇది సిపిఐ, ఏఐటియూసి విజయమని, భవిష్యత్లో సింగరేణి సంస్థ మనుగడకు మరిన్ని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు పికే ఓసి డిప్ ప్రైవేటు పరం కాకుండా సిపిఐ ఏఐటియూసి కలిసి చేసిన పోరాట ఫలితంగానే సింగరేణికి దక్కిందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలు మార్లు చేసిన అభ్యర్ధన మేరకు సింగరేణికి దక్కడంతో కార్మికులంతా ఆనందంతో ఉన్నారని తెలిపారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ కూడా సింగరేణికే దక్కిందని గుర్తు చేసారు. కొత్తగూడెం ప్రాంతం మనుగడ సాగేందుకు పెనగడవ, పెనుబల్లి రాంపురం అనిశెట్టిపల్లి పునుగుడుచెలక హేమచంద్రాపురం ప్రాంతాల్లో ఓపెన్ కాస్టు చేయవచ్చని చెప్పారు. కొత్తగూడెంలో ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, ఇక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటు కావడం ద్వారా ప్రయాణాలు సులవుతాయని, పారిశ్రామిక ప్రాంతమైన ఈ జిల్లాలో ఎయిర్ పోర్టు ఎంతో అవసరమని చెప్పారు. కొత్తగూడెం కేంద్రంగా పాస్పోర్టు సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, పోస్టాఫీసు అనుసంధానంగా ఈ పాస్పోర్టు సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, ఇందుకు సానుకూల స్పందన వస్తోందన్నారు. కొత్తగూడెం జిల్లా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని, ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే రూ.10 కోట్లతో నేషనల్ స్కిల్ డవల్మెంట్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయం కూడా త్వరలో జిల్లాకు రానుందని కూనంనేని తెలిపారు. కొత్తగూడెం బస్టాడ్ పునః నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. అదే విధంగా పాల్వంచ బస్టాండ్ను కూడా నూతన హంగులతో తీర్చిదిద్దేంకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం బైపాస్కు రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ బైపాస్ రోడ్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో వాహనా రద్దీ తగ్గనుందన్నారు. నియోజకవర్గ సమాగ్రాభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామని, ప్రాధాన్యతా క్రమంలో నిధులు వెచ్చించి ప్రజలకు మౌళిక వసతులు కల్పించేందుకు కృషి జరుగుతుందన్నారు. చిన్నచిన్న గ్రామాలు మొదలుకుని పట్టణాలు, కార్పొరేషన్ వరకు సిసి రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూ నిధులు తెప్పించి పనులు చేస్తున్నామని కూనంనేని తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్

ఎదురైన తక్షణమే పరిష్కరించేందుకు ప్రతీ బుధవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో నియోజక వర్గాన్ని అన్ని విధాలు అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకునండా కృషి చేస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఏఐటియూసి) ప్రధాన కార్యదర్శి కొరిమిరాజ్ కుమార్, వంగా వెంకట్ రమణమూర్తి వైవిరావు, జి వీరస్వామి, రత్నకుమారి, సందెబోయిన శ్రీనివాసరావు, ప్రశాంత్, జలీల్ పాషా, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు కొమారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




**పాల్వంచ,ఆగస్టు05( భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో బుధవారం పాల్వంచలోని కే ఎల్ ఆర్ ఫార్మసీ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి పాల్వంచ సబ్ డివిజన్ డి.ఎస్.పి ఆర్. సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, సోషల్ మీడియా మోసాలు, పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, పార్ట్ టైమ్ జాబ్ మోసాలు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని, ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్లైన్కు కాల్ చేయడంతో పాటు ఎఎఎ.ఎవఎవతీఎతీఅఎవ.స్త్రశీఙ.అఅ వెబ్సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. సతీష్, పాల్వంచ టౌన్ ఎస్.ఐ టి. నాగరాజు , పాల్వంచ రూరల్ ఎస్.ఐ సురేష్ పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతకు సంబంధించిన పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు , పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఆత్మగౌరవానికి మహా ఘడియ

- కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠకు చర్ల కదలాలి!
- జల్--జంగల్--జమీన్ నినాదం మళ్లీ మార్మోగాలి.. ఆగస్టు 9న చర్లలో ఆదివాసుల మహాసమీకరణ!
- కొమరం భీమ్ స్ఫూర్తితో ఐక్యంగా అడుగులు.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని చరిత్రాత్మకం చేద్దాం!



**చర్ల, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న చర్ల మండల కేంద్రంలో నిర్వహించనున్న కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆదివాసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి యువత, మహిళలు, పెద్దలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజలను ఆహ్వానించే ఉద్దేశంతో చర్ల మండల ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ఆగస్టు 9న జరిగే విగ్రహ ప్రతిష్ఠ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యపరచనుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “జల్--జంగల్--జమీన్” నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన అమరవీరుడు కొమరం భీమ్ ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కేవలం ఒక వేడుకగా కాకుండా, ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు నాంది పలికే చారిత్రాత్మక దినంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9న చర్ల మండల కేంద్రంలో జరిగే కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రతి ఆదివాసీ కుటుంబం పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు వాసం ముసలయ్య, శ్యామల, తరుణ్, తాటి రామకృష్ణ, ఇరప ప్రకాష్, పూనెం వరప్రసాద్, కారం నరేష్, కాపుల కృష్ణ, పూజారి శ్రీకాంత్, కణితి శ్రీను, యాలం రమేష్ తదితరులు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ ఉచ్చులో పడొద్దు..!

- అపరిచితుల మాటలు నమ్మి ఆన్లైన్లో నగదు బదిలీలు చేయవద్దు
- ఓటీపీ, బ్యాంకు వివరాలు చెప్పడం ప్రమాదకరం
- సురక్ష కా తిరంగా--సైబర్ స్వతంత్ర తెలంగాణ'లో సీఐ అవగాహన




**మధిర,ఆర్సీ (భద్రాద్రి న్యూస్):- ఆగస్టు 5:** సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలకు మోసపోయి కష్టార్జిత ధనాన్ని కోల్పోవద్దని మధిర టౌన్ సీఐ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ‘సురక్ష కా తిరంగా--సైబర్ స్వతంత్ర తెలంగాణ’ కార్యక్రమంలో భాగంగా వ్యాపారులు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు ఫోన్ చేసి బహుమతులు వచ్చాయని, తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పి వల వేస్తున్నారని తెలిపారు. అలాంటి సందేశాలు, కాల్స్ను వెంటనే అనుమానించి దూరంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్, ఆన్లైన్ పెట్టుబడులు, పార్ట్టైమ్ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్ను విద్య, విజ్ఞానానికి మాత్రమే వినియోగించాలని, సైబర్ మోసాలపై అవగాహన ఉన్న విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రజలను కూడా చైతన్యపరచాలని కోరారు. అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

# తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల పాదయాత్ర

- తల్లాడ మండలం నుంచి భద్రాచలం వరకు కళాకారులు పాదయాత్ర
- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారధిలో ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాలి







**వైరా, ఆగస్టు 5,(భద్రాద్రి న్యూస్ ) :** ఖమ్మం జిల్లా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నుంచి భద్రాచలం వరకు తెలంగాణ ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ సంక్షేమ భరోసా పథకాల తోపాటు సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామం నుంచి భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయం వరకు బుధవారం తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో ఉద్యమ కళాకారుడు కేవీ బృందం అధ్యక్షుడు కాంపల్లి వంశీ ఆధ్వర్యంలో 101 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారు ఈ పాదయాత్రను తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి రవి,మండల గొడుగునూరి అధ్యక్షులు జిల్లా నాయకులు జక్కంపూడి కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజమైన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి, కాళీ పోస్టులను ఫిలప్ చేస్తామని హామీ ఇచ్చారు కానీ, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల అవుతున్న ఇంతవరకి కళాకారులను పట్టించుకునే నాధుడే లేదు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ కళాకారులు పాత్ర ఉన్నదని, నిజమైన కళాకారులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగ భరోసా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని, అదేవిధంగా సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే ముందు ఉద్యమ కళాకారులు ఎంతో కృషి చేశారని వారి పోరాటం మరువలేనిదని, కళాకారులకు తగిన ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే ముందు ఉద్యమ కళాకారులు ఎంతో కృషి చేశారని, కళాకారులకు తగిన ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఉద్యమ కళాకారుడు కొంపల్లి వంశీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ పాదయాత్రలో కాంపల్లి వంశీ, జిల్లా సాంస్కృతి కళా మండల అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు, తాళ్లపల్లి మనోజ్ కుమార్, మోదుగు గోవిందరావు, భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జానకిరామ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి రవి, జక్కంపూడి కిషోర్, గోవింద్, శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, కృష్ణారెడ్డి, రాయల రాము, రేటు గూడెం సర్పంచ్, మోదుగు తిరుమల్ రావు, ఉప సర్పంచ్ పైడిపల్లి జగన్, అంబేద్కర్ నగర్ సర్పంచ్ మర్సకట్ల బాబురావు, ఎస్ కే జానీ మియా, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు జిల్లాల ఉద్యమ కళాకారులు పాదయాత్రలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం: పోలీస్ కమిషనర్

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ' అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు. సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఒటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని, నేరగాళు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో మరింత చురుకుగా మారుతుండగా, సాధారణ ప్రజలలో అవగాహన అంతే వేగంగా పెరగకపోవడం సమస్యను మరింత క్లిష్టతరం చేస్తోందన్నారు. ప్రతి నెల వందల సంఖ్యలో సైబర్ మోసాలపై ఫిర్యాదులు నమోదవుతున్నాయని, లక్షల రూపాయల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే






ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఆన్లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# గార్ల మండలాన్ని మరిచిపోయిన మహబూబాబాద్ డిపో అధికారులు -- ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** పూర్వ ఖమ్మం జిల్లాలో భాగంగా ఉన్న గార్ల మండలం, జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం మహబూబాబాద్ జిల్లాలో విలీనం చేయబడింది. అయితే కొత్త జిల్లా ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, గార్ల మండల ప్రజలకు మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఇప్పటి వరకు ఒక్క సాధారణ బస్సు కూడా కేటాయించకపోవడం అత్యంత విచారకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం డిపోకు చెందిన బస్సులే గార్ల మండలం మీదుగా ఖమ్మం--మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు అనేక సంవత్సరాలుగా నడుస్తున్నాయి. గార్ల ప్రాంతంలో ఆర్టీసీకి టికెట్ ఆదాయం కూడా గణనీయంగా ఉన్నప్పటికీ, మహబూబాబాద్ డిపో అధికారులు ఈ మండల అవసరాలను పూర్తిగా విస్మరించడం బాధాకరం.

గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు పలుమార్లు మహబూబాబాద్ డిపో అధికారులను కలిసి గార్ల మండలానికి బస్సులు కేటాయించాలని వినతిపత్రాలు సమర్పించారు. ప్రతిసారి "త్వరలో బస్సులు ఏర్పాటు చేస్తాం" అనే హామీలు మాత్రమే ఇస్తూ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

గతంలో రైల్వే గేట్ల కారణంగా రవాణాకు కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం ఆ సమస్యలు తొలగిపోయి రహదారులు మెరుగుపడిన నేపథ్యంలో, గార్ల మండలానికి నేరుగా మహబూబాబాద్ డిపో నుంచి సాధారణ, ఎక్స్ప్రెస్, అవసరమైతే హైదరాబాద్కు వెళ్లే బస్సులను కూడా ఏర్పాటు చేయడానికి ఎలాంటి అడ్డంకులు లేవు.




గార్ల మండలం షెడ్యూల్డ్ ఏరియా (ఏజెన్సీ) పరిధిలో ఉండటంతో పాటు, అనేక గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ ప్రయాణాలు చేస్తున్నారు. అందువల్ల మహబూబాబాద్ డిపో నుంచి గార్ల మండలానికి తగిన సంఖ్యలో ఆర్టీసీ బస్సులను వెంటనే కేటాయించాలని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉన్నతాధికారులు, రవాణా శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ మరియు ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గార్ల మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ విషయంపై ప్రభుత్వం, టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి గార్ల మండల ప్రజలకు న్యాయం చేయాలని, లేనియెడల వివిధ రాజకీయ పార్టీల తరపున అఖిలపక్ష తరపున భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేసే పరిస్థితి ఉంటుందని, గార్ల సీనియర్ సోషల్ వర్కర్ అండ్ యాక్టివిటీస్ గార్ల మండల ప్రజల తరపున కందునూరి ఈశ్వర్ లింగం విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

# 'హార్వెస్ట్' జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం




**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** హార్వెస్ట్ జూనియర్ కళాశాలలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ ఢ సెక్యూరిటీ" అంశంపై సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఖమ్మం సైబర్ క్రైమ్ ఐ.న్యా (ఇంటెలిజెన్స్) సి.హెచ్. ఆర్.వి.ఫణీంద్ర, సి.ఐ. బి.రవి కుమార్, ఎస్.ఐ.లు జి.రంజిత్ కుమార్, విజయ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారని హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం తెలియజేశారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, ఫిషింగ్, ఓ.టి.పి మోసాలు, సోషల్ మీడియా భద్రత, డిజిటల్ చెల్లింపులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బలమైన పాస్వర్డ్ వినియోగం, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకునే విధానంపై అధికారులు విద్యార్థులకు సవివరంగా అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు, నకిలీ కాల్స్, తప్పుడు ఉద్యోగ ఆఫర్లు వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమగ్ర సమాధానాలు ఇచ్చి, సైబర్ భద్రతపై విలువైన సూచనలు అందించారు. అలాగే విద్యార్థులచే ప్రతిజ్ఞ కూడా చేయించారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్ గారు, ప్రిన్సిపల్ ఆర్.పార్వతి రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలకు సంబంధించిన పోస్టర్స్ ఆవిష్కరించారు.



కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకున్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించాలి

**- డిప్యూటీ తహసీల్దార్కు అఖిలభారత ఐక్య రైతు సంఘం వినతి**



**సింగరేణి, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, నష్టపోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ నాయకుడు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం, వాతావరణ శాఖ ప్రకటనలను నమ్మి ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులకు ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తకుండా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, స్వల్పకాలిక పంటల విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలని, రైతుల పాత రుణాలను పూర్తిగా మాఫీ చేసి వడ్డీలేని కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు బీమా వర్తింపజేయడంతో పాటు గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎండిపోతున్న పంటలకు ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలని, పోడు సాగులో అటవీ శాఖ అధికారుల ఆటంకాలను తొలగించి పట్టా పోడు భూముల్లో ట్రాక్టర్లతో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు పులకని సత్తిరెడ్డి, డివిజన్ నాయకుడు వద్దే వెంకటేశ్వర్లు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ సింగరేణి మండల నాయకుడు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేణుకుమార్కు మరోసారి అండగా నిలిచిన మాజీ ఎంపీ నామ

**- వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లు మాఫీ చేయించిన మాజీ ఎంపీ నామ**

**- క్లిష్ట సమయంలో మానవత్వం చాటిన మాజీ ఎంపీ నామ**





**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఆస్పత్రి యాజమాన్యంతో నేరుగా మాట్లాడి వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన వేణుకుమార్కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భారత్ బాబు, ఆస్పత్రి వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందిని నామ అభినందించారు. ఇప్పటికే నామ ట్రస్ట్ తరపున వేణుకుమార్కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామ వారి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం వేణుకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, జీవితంలో ఇంకా ముందుకు వెళ్లాలని, సాధించాల్సింది చాలా ఉందని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. వేణుకుమార్ త్వరగా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన ఆయన, నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# షిరిడి సాయిబాబా మందిరంలో మీన నృత్య ప్రదర్శనలు



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** మీనా నృత్యాలయ నాట్యా గురు మీనా ఏలూరి బృందం షిర్డీ సాయిబాబా మందిరంలో నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసలు పొందారు. ఖమ్మం నుంచి వెళ్లిన మీనా బృందం కళాకారులను ఆలయ కమిటీ వాళ్ళు ఆదరించారు స్వామివారు ఉత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది మీనా తో పాటుగా ఆమె శిష్యురాలు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నాట్య కళాకారులను ఘనంగా సత్కరించారుగురువు నాట్యామయూరి మీనా ఏలూరి, సాహితీ, ఎశ్వర్ధిక, యోగ్ణ శ్రీ మాన్య గ్ణాణ సహస్ర రిత్యిక సాయి మాధురి తదితరులు పాల్గొన్నారు

# బొమ్మ సత్య ప్రసాద్ మృతి పట్ల మంత్రి తుమ్మల సంతాపం.



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** బొమ్మ గ్రూప్స్ అధినేత బొమ్మ రాజేశ్వరరావు కుమారుడు సత్య ప్రసాద్ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్వర్గీయ సత్యప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కలిగించాలని మంత్రి తుమ్మల తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మంత్రి తుమ్మల తన సానుభూతిని తెలియజేశారు.

# బొమ్మ విద్యాసంస్థల వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ మృతి



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** నగరంలోని బొమ్మ విద్యాసంస్థల వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్(41) బుధవారం కన్నుమూశారు. ఆయన మృతి విద్యారంగంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యాసేవల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేసిన సత్యప్రసాద్ మృతిపట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రముఖుల సంతాపం వ్యక్తం చేశారు. సత్యప్రసాద్కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి బొమ్మ రాజేశ్వరావు విద్యాసంస్థలతో పాటు రైస్ మిల్లులు నిర్వహణలో ఉన్నారు.

# బొమ్మ సత్య ప్రసాద్ గారి మరణం చాలా బాధాకరం

**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** బొమ్మ సంస్థల అధినేత , మాజీ రేషన్ షాప్ డీలర్ల ప్రెసిడెంట్ శ్రీ బొమ్మ రాజేశ్వరరావు గారి తనయుడు బొమ్మ సత్య ప్రసాద్ గారి మరణం చాలా బాధాకరం అతి చిన్న వయసులో అనారోగ్యానికి గురి అయ్యి మరణించడం తీవ్ర బాధాకరం వారి మరణం పట్ల చింతిస్తూ ఖమ్మం నగర ఖమ్మం జిల్లా రేషన్ షాప్ డీలర్ల సంఘాల తరపున డీలర్ల తరపున వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబం ధైర్యంతో ఉండాలని కోరుకుంటూ సత్యప్రసాద్ గారి మృతికి సంతాపం తెలియజేస్తూ వారికి ఆ దేవుడు స్వర్గ లోక ప్రాప్తి కలిగించాలని కోరుకుంటూ! ఖమ్మం నగర, జిల్లా రేషన్ డీలర్లు

# బురదమయంగా మారిన మర్రిగూడెం ప్రధాన రహదారి బ్రిడ్జి





**అన్నపురెడ్డిపల్లి, (భద్రాద్రి న్యూస్) ఆగస్టు, 05 :** అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు నరకయాతన మిగులుతుంది. సీతారామ కాలువ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి పూర్తిగా బురదమయంగా మారింది. ?రోడ్డుపై ఏర్పడిన గుంతలు మట్టి, వర్షపు నీటితో నిండిపోయి కనిపించకుండా పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ?అటుగా వెళ్లే వాహనాలు గుంతల్లోని నీటిని నడిచి వెళ్లే పాదచారులపైకి చిమ్ముతుండటంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ?గుంటల్లో నిలిచిన వర్షపు నీటి కారణంగా దుర్గంధం వెదజల్లుతోందని, గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా తాండవిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

?సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఆదివాసీ ఆత్మగౌరవానికి మహా ఘడియ..
# కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠకు చర్ల కదలాలి!

**- జల్--జంగల్--జమీన్ నినాదం మళ్లీ మార్మోగాలి.. ఆగస్టు 9న చర్లలో ఆదివాసుల మహాసమీకరణ!**

**- కొమరం భీమ్ స్ఫూర్తితో ఐక్యంగా అడుగులు.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని చరిత్రాత్మకం చేద్దాం!**



**చర్ల, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న చర్ల మండల కేంద్రంలో నిర్వహించనున్న కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆదివాసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి యువత, మహిళలు, పెద్దలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమా నికి ప్రజలను ఆహ్వానించే ఉద్దేశంతో చర్ల మండల ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ రథం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ఆగస్టు 9న జరిగే విగ్రహ ప్రతిష్ఠ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యపరచనుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “జల్--జంగల్--జమీన్” నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన అమరవీరుడు కొమరం భీమ్ ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కేవలం ఒక వేడుకగా కాకుండా, ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు నాంది పలికే చారిత్రాత్మక దినంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9న చర్ల మండల కేంద్రంలో జరిగే కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రతి ఆదివాసీ కుటుంబం పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు వాసం ముసలయ్య, శ్యామల, తరుణ్, తాటి రామకృష్ణ, ఇరప ప్రకాష్, పూనెం వరప్రసాద్, కారం నరేష్, కాపుల కృష్ణ, పూజారి శ్రీకాంత్, కణితి శ్రీను, యాలం రమేష్ తదితరులు విజ్ఞప్తి చేశారు.

# హామీలు ఎక్కడ..?



**- వద్దిపేట చెక్ డ్యాం, డిగ్రీ కళాశాల వెంటనే మంజూరు చేయాలి**

**- ఆదివాసీల సమస్యలు పరిష్కరించి..**

**కూరగడ్డ భూములకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ**



**చర్ల, ఆగస్టు 5 (భద్రాద్రి న్యూస్):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా చర్ల మండలంలోని వద్దిపేట చెక్ డ్యాం నిర్మాణంతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ డిమాండ్ చేశారు.

బుధవారం ఆయన మాట్లాడుతూ, తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం ఒక పంటకే సాగునీరు అందుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వద్దిపేట చెక్ డ్యాం నిర్మించి, ఎత్తిపోతల పథకం ద్వారా 25 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని ప్రభుత్వం తప్పకుండా నిలబెట్టుకోవాలని కోరారు.

వద్దిపేట చెక్ డ్యాం నిర్మాణం పూర్తయితే ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయ కూలీలకు కూడా ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా, విద్యాపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఏజెన్సీ ప్రజలకు, ఆదివాసీలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని విమర్శించారు.

సీతారామ ప్రాజెక్టు కారణంగా సుమారు 10 వేల ఎకరాల కూరగడ్డ భూములు నీట మునిగే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, కొత్తూరు, మొగలపల్లి, ఆనందకాలనీ తదితర ఏడు గ్రామాల ప్రజలు తరతరాలుగా ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అలాగే కొయ్యూరు, మామిడిగూడెం, గద్దురుగట్టు ప్రాంతాల్లో ఆదివాసీల భూములను అటవీ శాఖ ఆక్రమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన చట్టాలను ఉల్లంఘిస్తూ వారిపైనే అక్రమ కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. పాత పోడు భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని, ఆదివాసీలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీఎఫ్ (ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం) జిల్లా నాయకులు గొంది మూయన్న, ఇరప ప్రసాద్, బొర్రా సరోజిని, కొండ్రు రాజేశ్వరి, బంద నాగమణి, తెల్లం బుచ్చయ్య, తెల్లం రామకృష్ణ, తెల్లం కమల తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు చెక్... అవగాహనే మహా ఆయుధం!

**- చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో**
**పోలీసుల సైబర్ భద్రత సదస్సు**

**- ఓటీపీ, బ్యాంకు వివరాలు పంచుకుంటే**
**ఖాతా ఖాళీ.. విద్యార్థులకు డీఎస్పీ హెచ్చరిక**








**చర్ల, ఆగస్టు 5 భద్రాద్రి న్యూస్ :** దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో సురక్షక్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ మోసాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా. లి భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ లింకులు, ఫేక్ యాప్‌లు, ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే ఆఫర్లు, లాటరీ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని విద్యార్థులకు వివరించారు. చర్ల, సీఐ రాజు వర్మ మాట్లాడుతూ.. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి. కేశవ్, ఆర్. నర్సిరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ట్రాక్టర్ ఇటుకలు
# విరాళంగా అందించిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి. ఆగస్టు 5(భద్రాద్రి న్యూస్ రాములు ):** మండలంలోని పొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగయ్యగుంపు గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ట్రాక్టర్ లోడు ఇటుకలను విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన దారావత్ముని నాయక్ విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్మాణానికి ఒక ట్రాక్టర్ లోడు ఇటుకలు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి తన అనుచరుడు ఎస్.ఎన్. నాయక్ ద్వారా ఇటుకలను పంపించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన సహకారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాములుతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన సహాయం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.






# బాలసభలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

**గద్వాల , ఆగస్టు 5:**

ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ‘బాల సభ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పర్ణిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... బాలల కోసం బాలలే నిర్వహించుకునే బాలసభలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శిరీష, ప్రధానోపాధ్యాయులు ముస్తాక్, పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఐడిఏ బొల్లారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

**పటాన్ చెరు, ఆగస్టు 5:**

జాగృతి దివస్ పురస్కరించుకుని బొల్లారం పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకూడదని, అపరిచితులు పంపే ఎపికె ఫైళ్లు, అనుమానాస్పద లింకులు, క్యూఆర్ కోడ్‌లు క్లిక్ చేయకూడదని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే ఓటిపి, యుపిఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, నకిలీ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, లాటరీలు, పెట్టుబడులు, గేమింగ్ రివార్డుల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధీర్ కుమార్, ఎస్సై అక్షిత, ఎస్సై కిష్టా రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించి, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పోలీసులు తెలిపారు.



# జిల్లా కేంద్రంలో ఆక్రమణల తొలగింపు పనుల ప్రక్రియ ప్రారంభం

**గద్వాల , ఆగస్టు 5 :**

గద్వాల పట్టణంలో రహదారులపై ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా సాగుతున్నది. ఆపరేషన్ రోప్‌లో భాగంగా బుధవారం కృష్ణవేణి చౌరస్తా నుంచి పాతబస్టాండ్ వరకు ఫుట్‌పాత్‌లపై, రహదారులకు ఇరువైపుల వెలసిన దుకాణాలు, తోపుడు బండ్లను అధికారులు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా క్రిష్ణవేణి సర్కిల్ పరిధిలోని రహదారికి ఇరువైపుల ఆక్రమణలను గద్వాల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. విడుతల వారిగా ఆక్రమణ తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసు విభాగాల బందోబస్తుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.